ప్రజాశక్తి
బుధవారం 9 ఏప్రిల్ 2025 5 అనంతపురం

సిలిండర్‌ను ఈడ్చుకుంటూ వస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఓదార్చి.. భరోసానిచ్చి..!

జగన్ వచ్చిన సందర్భంగా పాపిరెడ్డిపల్లికి చేరుకున్న వైసిపి శ్రేణులు

- ◆ లింగమయ్య కుటుంబానికి వైఎస్.జగన్ పరామర్శ
- ◆ అండగా ఉంటామని హామీ
- ◆ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు
- ◆ బీహార్‌లా చేస్తున్నారంటూ టిడిపిపై జగన్ మండిపాటు
- ◆ జనం తాకిడిలో హెలికాప్టర్‌కు సమస్య
- ◆ రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో పది రోజుల క్రితం హత్యకు గురైన వైసిపి మద్దతుదారుడు కురుబ లింగమయ్య కుటుంబాన్ని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పాపిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం తొలిసారిగా ఆయన సత్యసాయి జిల్లాకు విచ్చేయడంతో పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాపిరెడ్డిపల్లికి తరలివెళ్లారు. జగన్ హెలిక్యాప్టర్ దిగగానే పెద్దఎత్తున ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చుట్టుముట్టారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పాపిరెడ్డిపల్లి గ్రామానికి జగన్మోహన్‌రెడ్డి చేరుకున్నారు. కురుబ లింగమయ్య ఇంటికెళ్లారు. లింగమయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంట్లో కూర్చోని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఘటన జరిగిన రోజు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు.

శాంతిభద్రతలు క్షీణించాయి : వైఎస్.జగన్

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పారు. స్థానిక సంస్థల్లో తమకు బలం లేకున్నా తమవైపు తిప్పుకునేందుకు అనేక అప్రజాస్వామిక విధానాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరించారని మండిపడ్డారు. విశాఖపట్నం, తిరుపతి, రామకుప్పం, అత్తిలి తదితర ప్రాంతాల్లో ఇటువంటి ప్రయత్నాలు జరిగాయన్నారు. సత్యసాయి జిల్లా రామగిరి మండలంలోనూ ఎంపిటిసిలు ఎనిమిది మంది వైసిపి వాళ్లుంటే వారందరినీ భయపెట్టి టిడిపిలో చేర్చుకునేందుకు వివిధ రకాలుగా ఇక్కడి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆయన కుమారుడు పరిటాల శ్రీరామ్ ప్రయత్నించారన్నారు. దీనికి స్థానిక ఎస్ఐ సుధాకర్ మద్దతుగా వ్యవహరించారని పేర్కొన్నారు. వారి ప్రలోభాలకు లొంగకుండా వైసిపి ఎంపిటిసిలు గట్టిగా నిలబడ్డారన్నారు. అందుకు వారిని పోలీసు స్టేషన్‌లో బైండోవర్ చేసారని తెలిపారు. వారికి మద్దతుగా వెళ్లిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషచరణ్‌శ్రీ పైనా కేసులు నమోదు చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా తమపార్టీకి మద్దతుగా నిలిచిన కురుబ లింగమయ్యపై 20 మంది టిడిపి మద్దతుదారులు దాడి చేసి హత్య చేసారని ఆరోపించారు. దాడిలో 20 మంది పాల్గొంటే కేసులు మాత్రం ఇద్దరిపైనే పెట్టారని మండిపడ్డారు. ఇదే రకంగా నంద్యాల, మహానంది, పెద్దకురపాడుల్లోనూ వైసిపి నాయకులపై టిడిపి వారు దాడులు చేశారని చెప్పారు. దాడులే కాకుండా మరికొంత మందిపై తప్పుడు కేసు పెట్టి జైళ్లలో పెడుతున్నారన్నారు. పోసాని కృష్ణమురళి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నందిగామ సురేష్, వల్లభనేని వంశి తదితర నాయకులను జైళ్లలో పెట్టారని వివరించారు. పోలీసులను అడ్డంపెట్టుకని అప్రజాస్వామిక విధానాలను టిడిపి అవలంభిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు జరుగుతోందని యెద్దేవ చేశారు. పోలీసులు ఇదే తీరున వ్యవహరిస్తే తాము అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమన హెచ్చరించారు. బట్టలూడదీసి వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు సతీష్‌రెడ్డి, అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషచరణ్ శ్రీ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

విరిగిన హెలికాప్టర్ విండ్‌షీల్డ్.. రోడ్డు మార్గంలో జగన్ తిరుగు ప్రయాణం..!

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి పాపిరెడ్డిపల్లి గ్రామం సమీపం వరకు హెలికాప్టర్‌లో విచ్చేశారు. ఆ సమయంలో అక్కడికి పెద్దఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు చేరుకుని హెలికాప్టర్‌ను చుట్టుముట్టారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితులే నెలకొన్నాయి. ఈ పరిస్థితుల నడుమ హెలికాప్టర్ విండ్ షీల్డ్ విరిగిపోయింది. దీంతో ఆ హెలికాప్టర్‌లో విఐపిని తీసుకెళ్లలేమని పైలెట్లు చెప్పడంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రోడ్డు మార్గంలో బెంగళూరుకు పయనమై వెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి విచ్చేసిన సమయంలో పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం చేశారంటూ వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెలిప్యాడ్ వద్ద భారీగా చేరిన వైసిపి శ్రేణులు

ప్రజలపై భారాలు దుర్మార్గం

- ◆ పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించాలి
- ◆ సిపిఎం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లతో నిరసన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతం అవుతున్నా జనంపై కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి మరింత భారాన్ని వేయడం దుర్మార్గమైన చర్యని సిపిఎం నాయకులు విమర్శించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నాడు టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. గ్యాస్ సిలిండర్‌ను తాడుతో ఈడ్చుకుంటూ వస్తూ ఆందోళన చేపట్టారు. టవర్‌క్లాక్ వద్ద బైటాయించి కేంద్ర ప్రభుత్వం, మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.సావిత్రి, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ సామాన్యులు వాడుకునే వంటగ్యాస్ సిలండర్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచడం ప్రజలపై భారం వేయడమే అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తగ్గించడం మాని పెంచడం ఏమిటని ప్రశ్నించారు. సిలిండర్ పెంపులో ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా వర్తింపజేయడం మరింత దుర్మార్గం అన్నారు. ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యావసర గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకంపైన ఈ భారం పడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను తగ్గించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటనారాయణ, ముత్తుజ, ఇర్ఫాన్, వలీ, జీవ, ఎన్టీఆర్ శీన, ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, శంషాద్, రామాంజీ, లెవీ, శంకర్, మోహన్, పాల్గొన్నారు.

అన్ని అర్జీలకూ పరిష్కారం : మంత్రి కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

వృద్ధురాలి సమస్యను అడిగి తెలుసుకుంటున్న మంత్రి కేశవ్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందించే అన్ని సమస్యలకూ పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుంటారని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. విడపనకల్లు తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి స్వయంగా పాల్గొని అర్జీలను స్వీకరించి, బాధితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే రూఫ్ టాఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తనకున్న బాధ్యతలను ఒకవైపు నిర్వర్తిస్తూనే, ఉరవకొండ నియోజకవర్గ బాధ్యతలను కూడా పూర్తిస్థాయిలో చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులు, కష్టాలను పరిష్కరించడంలో ముందుంటానని తెలియజేశారు. హంద్రీనీవా కాలువ, జిబిసి కాలువ, విడపనకల్లు నుంచి గడేకల్లుకు,వి.కొత్తకోటకు, హావలిగి రోడ్డు,తాగునీటి ఏర్పాట్లు, ప్రజల ఆశలు, ఇబ్బందులు అన్నింటినీ సమతూకం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఉరవకొండలో ప్రతి కులానికి ఒక కమ్యూనిటీ హాల్ ఉండాలనే ఉద్దేశంతో గతంలో ఊహించని రీతిలో నిధులు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎ.మాలోలతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కేంద్రం విధానాలతో
పెన్షనర్లకు విఘాతం

◆ సిసిఎస్ పెన్షన్ బిల్లును ఉప సంహరించాలి ◆ సిఐటియు రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పెన్షనర్లకు నష్టం కలిగించి తిరోగమనం వైపు నెట్టివేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, విధానాలపై ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మార్చి 25న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి పాస్ చేయించుకున్న బిల్లును వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నగరంలోని ఎన్జీవో హోంలో మంగళవారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయ్ యూనియన్ నాయకులు శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య వక్తగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు రిటైర్డ్ బ్యాంక్ ఎంప్లాయ్ పి.అజయ్ కుమార్ హాజరయ్యారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జాతీయ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ఉద్యోగ సంఘాల నాయకులు ఎంఎన్‌టి.రాజు, నజీర్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ రూల్స్‌కు అతి ప్రమాదకరమైన సవరణలను లోక్ సభలో ఆర్థిక బిల్లులో భాగంగా ప్రవేశపెట్టి పాస్ చేయించుకుందన్నారు. ఇప్పటి వరకు, పే కమిషన్ల సిఫార్సులన్నీ పెన్షనర్లకు ఒకే విధంగా వర్తించబడ్డాయన్నారు. మొదటిసారిగా మోడీ ప్రభుత్వం పెన్షనర్లలో వివక్ష చూపడానికి చట్టం చేయడం దుర్మార్గం అన్నారు. ఇది అమలయితే కేంద్ర ఉద్యోగ పెన్షనర్లు అందరికీ నష్టం వాటిల్లుతుందన్నారు. పే కమిషన్ సిఫార్సులు అమలైన తేదీ తరువాత ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు మాత్రమే పెరిగిన వేతన ప్రయోజనాలు వస్తాయన్నారు. ఆ తేదీకి ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు ఎలాంటి ప్రయోజనాలు వర్తించవన్నారు. సుప్రీంకోర్టు గతంలో పెన్షనర్లను ఉద్యోగ విరమణ తేదీ ఆధారంగా వేరుచేయడం అసమంజసమని తీర్పు చెప్పిందన్నారు. అయినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొండిగా పెన్షనర్లకు విఘాతం కలిగించే బిల్లు చేయడం దుర్మార్గం అన్నారు. రాజ్యసభలో కూడా ఈ బిల్లు ఆమోదం పొందితే దేశంలోని పెన్షన్‌దారులందరికీ ఉరితాడే అవుతుందన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లలందరూ సమైక్యంగా ఉద్యమించి, ఓపీస్ సాధనకు, ఇలాంటి తిరోగమన చర్యలను తిప్పి కొట్టేందుకు పోరాటమే ఏకైక మార్గంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్మెంట్ వెంకటప్ప, ఇరిగేషన్ నాగన్న, బ్యాంకు వలీ, సిఐటియు నాయకులు ఆర్‌వి.నాయుడు, వెంకటనారాయణ, ముత్తుజా పాల్గొన్నారు.

జగన్.. శవ రాజకీయాలు మానుకో.!

- ◆ ఐదేళ్ల పాటు ప్రజాకంఠక పాలన
- ◆ పోలీసులే గుడ్డలూడదీస్తారు జాగ్రత్త..
- ◆ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ఎంఎస్.రాజు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఐదేళ్ల పాటు వైసిపి ఆధ్వర్యంలో ప్రూజా కంఠక పాలన సాగింది. ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అల్లకల్లోలం అయ్యింది. ప్రస్తుతం ప్రశాతంగా ఉన్న రాష్ట్రంలో కక్షలు రేపేందుకు ప్రయత్నిస్తున్నావ్.. ఇలాంటి శవ రాజకీయాలు మానుకుంటే మంచిది.' అని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో క్షణికావేశంలో జరిగిన గొడవలో వ్యక్తి చనిపోతే దాన్ని రాజకీయం చేస్తూ జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. తన రాజకీయ స్వార్థం కోసం జగన్‌రెడ్డి రాష్ట్రంలో శవాలు ఎక్కడ కన్పిస్తాయా అని ఎదురుచూస్తున్నారని తెలిపారు. పరామర్శల పేరుతో కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి పాలన హత్యలకు గురైన బిసిలు, దళితులు, మైనార్టీల కుటుంబాలను జగన్ పరామర్శించాలన్నారు. ఐదేళ్ల పాటు నియంత పాలన సాగించిన ఆయన ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్య పాలన చేస్తున్నారనే కాబట్టే జగన్ హెలీక్యాప్టర్‌లో వచ్చి వెళ్లగలిగారన్నారు. జగన్ పర్యటను అడ్డుకోవాలంటే తమకు పెద్ద కష్టం ఏమీ కాదన్నారు. పోలీసులను గుడ్డలూడదీస్తామంటూ మాట్లాడుతున్న జగన్‌కు పోలీసులే గుడ్డలూడదీసే రోజులు వస్తాయన్నారు. జగన్ డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

నిష్పక్షపాతంగా పోలీసుల విధి నిర్వహణ

ఎస్పీ వి.రత్న

ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పర్యటనలో పోలీసులు ఎంతో సంయమనంతో వ్యవహరించిన నిష్పక్షపాతంగా విధులు నిర్వహించారని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు పోలీసుల భద్రతా చర్యపై ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆమె మంగళవారం నాడు విలేకరులతో మాట్లాడి వివరణ ఇచ్చారు. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామం కావడం అనుమతి లేని వారు ఎవరూ రావొద్దని ముందస్తుగానే సూచించామన్నారు. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా సోషల్ మీడియా ద్వారా ప్రజలను సమీకరించారన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే విధంగా బస్, లారీలు, పోలీసులు ఆపితే ఆగకుండా నడిచి అయినా రావాలని పిలుపు నివ్వడం కూడా అధిక జనం పోగుకావడానికి కారణం అయ్యిందన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించి పూర్తి స్థాయి భద్రత కల్పించి నప్పటికీ నిర్వాహకులు నిబంధనలు పాటించ లేదన్నారు. కార్యక్రమంలో 1100 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారన్నారు. హెలిప్యాడ్ వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో 250 మంది సిబ్బందిని నియమించి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలియజేశారు. వైసిపి వారే హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకున్నారని, దానికి వారే సాంకేతిక లోపం చూపించి కావాలనే రోడ్డు మార్గాన జగన్ వెళ్లారన్నారు. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారమే ఆయన రోడ్డుమార్గాన బెంగుళూరు వెళ్లినట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని ఎస్పీ స్పష్టం చేశారన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం..

మంత్రి సత్యకుమార్ యాదవ్

సర్వజన ఆసుపత్రిలో ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రతిరోజు దాదాపు 1,70,000 మంది రోగులు వస్తున్నారని వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందనిరాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అనంతపురం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో ఆర్ఒ ప్లాంట్, తల్లిపాల నిధి కేంద్రం, ధన్వంతరి సమావేశ మందిరాలను అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణతో కలిసి మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమలో తిరుపతి తర్వాత అనంతపురం జిల్లాలో తల్లిపాల నిధి కేంద్రాన్ని తాడిపత్రి అర్జస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిందన్నారు. దాతలు ఇలా ముందుకొచ్చి ఆసుపత్రి అభివృద్ధికి చేయూతనివ్వడం శుభపరిణామం అన్నారు. రాయలసీమ ప్రాంతంలో కర్నూలు ఆసుపత్రి తరువాత అత్యధిక రోగులు వచ్చేది ఆసుపత్రి అనంతపురం సర్వజన ఆసుపత్రి అన్నారు. ఇక్కడికి వచ్చే రోగులందరికీ మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. జిజిహెచ్‌లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలియజేశారు. వైద్యశాఖలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషలిస్టులు తదితర సిబ్బంది దాదాపు 59 శాతం కొరత ఉంటే కూటమి ప్రభుత్వం వచ్చి నోటిఫికేషన్ జారీ చేసి కొత్త నియామకాలు చేపట్టిందన్నారు. రాబోయే రోజుల్లో వైద్య శాఖ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు కషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ , జిజిహెచ్ సూపరిండెంట్ వెంకటేశ్వరరావుతో పాటు వైద్య సబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు మంగళవారం పట్టణంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి టి సర్కిల్ వరకూ భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్చుత్‌ప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తుంటే గత్యంతరం లేక సమ్మె చేయాల్సి వచ్చింద న్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు, పిఎఫ్ చెల్లిం చాలని అనేకసార్లు కాంట్రాక్టర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ స్పందించలేదన్నారు. కార్మికులు సమ్మె చేస్తుంటే కాంట్రాక్టర్ మాత్రం బయట వ్యక్తులను సోమవారం రప్పించి మోటార్లు ఆన్ చేయించి కార్మికులన బెదిరించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పంది ంచి వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి యూనియన్ జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి, నాయకులు నరేష్, నాగరాజు, తిప్పేస్వామి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

బీడీ కార్మికుల సమస్యలను పట్టించుకోండి

కార్మిక చట్టాన్ని అమలు చేయాలి-బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి

బీడీ పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల బతుకులు పొగజూరుతున్నాయని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓబులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో బీడీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీడీ కార్మికులకు కార్మికుల చట్టంతోపాటు సంక్షేమాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధంగా అగ్రిమెంట్ల పేరుతో మూడేళ్ల కాల పరిమితి పెట్టి బీడీ కార్మికులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో బీడీ కార్మికులకు పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, కార్మికుల పిల్లలకు స్కాలరిషిప్, కార్మికులకు వైద్యం అందుతున్నాయన్నారు. అయితే రాష్ట్రంలో మాత్రం అవి అమలు కావడంలో లేదన్నారు. ప్రతి ఆరుమాసాలకు కూలి రేట్లు పెంచాల్సి ఉండగా సంవత్సరాలు గడుస్తున్నా వెయ్యి బీడీలకు కేవలం రూ.200 మాత్రమే ఇస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా బీడీ కార్మికులకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి చేతులు రావడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మికులకు పెరిగిన ధరలు కనుగుణంగా వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ 28శాతం నుంచి బీడీ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బీడీ కార్మికులంతా ఏకమై ఏప్రిల్ 16వ తేదీ వరకూ తాడిపత్రి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నర్సింహారెడ్డి, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ ఓబులు, కార్మికులు

బీడీ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

తాడిపత్రి బీడీ కార్మిక సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా నూర్జాహాన్ బీబీ, ప్రధాన కార్యదర్శులుగా ఆరీఫా, రహీంబీ, ఉపాధ్యక్షులుగా ఇమాంబీ, బసిరున్, రమీజా, సహాయ, కార్యదర్శులుగా హసీనా, రసూల్‌బి, షాను, గౌరవాధ్యక్షులుగా ఉమాగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

త్వరలో జొన్న కొనుగోలు కేంద్రాలు

జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ రమేష్‌రెడ్డి

జొన్నలను పరిశీలిస్తున్న జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

త్వరలోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన జొన్నపంటను కొనుగోలు చేయనున్నట్లు సివిల్ సప్లై మేనేజర్ రమేష్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో జొన్న పంట సాగు చేసి ఇంటి వద్ద నిల్వ ఉంచుకున్న పంటను రమేష్‌రెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా మండలంలో జొన్న పంట సాగు చేసిన రైతుల వివరాలను స్థానిక వ్యవసాయ అధికారి సాయికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ఎఒ స్పందిస్తూ మండలంలోని బొల్లనగుడ్డ గ్రామంలో 299 మంది రైతులు 1,004 ఎకరాలు, సిద్ధరాంపురంలో 312 మంది రైతులు 636 ఎకరాలు, అరేసముద్రంలో 142 మంది రైతులు 394 ఎకరాలు, గోనేహాళ్‌లో 41 మంది రైతులు 124 ఎకరాల్లో జొన్నపంట సాగు చేసినట్లు తెలిపారు. అనంతరం సివిల్ సప్లై మేనేజర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ మండలంలో జొన్నపంట సాగు చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక్కో రైతు నుంచి 20 కింటాళ్ల వరకూ కొనుగులో చేయడంతోపాటు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3,371గా నిర్ధారించినట్లు తెలిపారు. జొన్నసాగు చేసిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డును స్థానిక ఆర్‌ఎస్‌కెలకు తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సొసైటీ అధికారి అనుమంతు, రైతులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలకు డిమాండ్

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షులు నందు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీసీ హాస్టల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువులు పేరుతో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు వ్యాపారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఆరోపించారు. ముందస్తు అడ్మిషన్ల సమాచారాన్ని ఎంఇఒ దృష్టికి తీసుకెళ్ళినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఓవైపు ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తానని చెబుతూనే ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ చేస్తూ తరగతులను నిర్వహిస్తుయన్నారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా ఆయా పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షులు తరుణ్, మండల నాయకులు భాస్కర్, ఎర్రిస్వామి, ప్రసాద్, కుమార్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

12న 'గీత పిలుస్తోంది' ఆడియో ఫంక్షన్

విలేకరులతో మాట్లాడుతున్న గీత పిలుస్తోంది సినిమా సభ్యులు

ప్రజాశక్తి-గుత్తి

అనంతపురంలో ఈనెల 12వ తేదీన గీత పిలుస్తోంది హర్రర్ సినిమా ఆడియో ఫంక్షన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సినిమా డైరెక్టర్ దినేష్ తేజ చిందలూరు తెలిపారు. మంగళవారం పట్టణంలోని బసవేశ్వర ఆలయ ప్రాంగణంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు సి.విజయభాస్కర్ అధ్యక్షతనగీత పిలుస్తోంది సినిమా ఆడియో ఫంక్షన్ ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్‌పై గీత పిలుస్తోంది సినిమాను 5 భాషల్లో నిర్మించి త్వరలో విడుదలకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోనా మురళీధర్‌రెడ్డి, కోనా ప్రదీప్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు వైస్‌ఛైర్మన్ కె.రామ్మోహన్, శివకుమార్‌చౌదరి, సీనియర్ పాత్రికేయుడు గోవిందరాజులు, న్యాయవాది గంగాధర్ కుమార్, సినిమా బృందం శ్రావణి, గౌతమ్, గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, నాయకులు హెచ్‌ఎం.జిలాన్, బాబాసాహెబ్, దస్తగిరి, వీరేష్, మైను, షార్ట్ మూవీ డైరెక్టర్ ప్రశాంత్ దిల్ సే, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు

బ్యాంకును ప్రారంభిస్తున్న చీఫ్ ఆర్‌ఎం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును స్థానిక విద్యుత్‌నగర్ సర్కిల్‌లోని నూతన భవనంలోకి మార్చినట్లు బ్యాంక్ చీఫ్ రీజినల్ మేనేజర్ సంజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు మంగళవారం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులు ఈ మార్పులు గమనించి సహకరించాలని కోరారు. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి విశాలమైన ప్రాంగణంలోకి బ్యాంకును మార్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ అనీష్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆరోవ అడిషనల్ జిల్లా జడ్జి గారి కోర్టు,గుత్తి
M.V.O.P. No:74/2020
Between:
బెస్త ఆదిలక్ష్మి & ఇతరులు ...వాదులు
ఎదిరి
బెస్త సుధీర్ & ఇతరులు ...ప్రతివాదులు
R4వ ప్రతివాదికి నోటీసు
R4:యం.సరస్వతి W/o యం.శంకరయ్య లేట్, హిందు, వయస్సు 45 సంIIరాలు, D.No:2-4A, కందుకూరు గ్రామం & పోస్టు, రాప్తాడు మండలం, అనంతపురం జిల్లా.
ఇందుమూలముగా ప్రతివాది అయిన మీకు తెలియజేయడం ఏమనగా పై కోర్టు వారు పై కేసులో మీకు పలుమార్లు నోటీసులు పంపిననూ చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ చేయమని ఆదేశించి పై కేసును 02-05-2025వ తేదికి మీ హాజరు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కావున సదరి తేదినాడు ఉదయం 10:00 గంటలకు ఖుద్దున గానీ, లేక వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయడమైనది.
వాయిదా:02-05-2025
(కోర్టు వారి ఆదేశాల మేరకు)
శ్రీ పి.నరశింహుడు,
శ్రీమతి వి.యల్.కామేశ్వరి,
వాదిపరం న్యాయవాదులు, అనంతపురం.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో,అనంతపురం
Guardian O.P. No:13/2025
Between:
ఉత్తరాది గోవిందు ...వాది
ఎదిరి
-నిల్- ...ప్రతివాది
బహిరంగ నోటీసు
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై తెలిపిన వాది పైన కనబరచిన గార్డియన్ ఒ.పి. ఫైల్‌చేసి మైనర్ అయినటువంటి ఉత్తరాది హర్షితకు చెందిన కక్కలపల్లి గ్రామ పొలం, రుద్రంపేట గ్రామ పంచాయితీకి చెందిన సర్వే నెం.17లోని ఎ.0.03.67 సెంట్లలో 1/12వ భాగాన్ని అమ్ముటకు పై కోర్టు వారి అనుమతి కోరుతూ దాఖలు చేసినారు. కావున ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న ఎడల తేది:21-04-2025 నాడు ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ, లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను.లేనంతట పై కేసు వాదిపరంగా తీర్మానించబడును అని తెలియజేయబడును.
వాయిదా:21-04-2025
(కోర్టు వారి ఆదేశాల మేరకు)
శ్రీ జి.రామమూర్తి,
వాదిపరం న్యాయవాది, అనంతపురం.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీలు

అనంతపురం క్రైం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా జాతీయ, రాష్ట్రీయ, జిల్లా రహదారులు, జిల్లా కేంద్రం, మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లో వాహనాల తనిఖీలు చేపట్టి రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. అలాగే గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు... అక్రమ మద్యం, నాటు సారా, తదితరాలు అక్రమ రవాణా జరుగకుండా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో మీపై మీ కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకుని రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని అవగాహన చేశారు.

నిందితులపై చర్యకు డిమాండ్

ఉరవకొండ : దానిమ్మ చెట్లకు నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు రాకెట్ల అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన రైతు నెట్టెం రామకృష్ణప్ప దానిమ్మ తోటను వైసిపి నాయకులు పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 20 దానిమ్మ చెట్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ దానిమ్మ చెట్లు సాగు చేసి రెండు నెలలైందన్నారు. ప్రస్తుతం కాపునకు కూడా వస్తున్న సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం బాధాకరమన్నారు. పోలీసులు వెంటనే నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, సిద్ధార్థ పాల్గొన్నారు.

చెరువులకు నీరందించాలి

మంత్రికి సిపిఎం, రైతుసంఘం నాయకుల వినతి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం, రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-గుంతకల్లు

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయడంతోపాటు రాగులపాడు లిఫ్ట్ నుంచి పిల్ల కాలువలు తవ్వి చెరువులకు నీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, రైతుసంఘం జిల్లా నాయకుడు విరూపాక్షి కోరారు. ఈమేరకు జల వరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ గుంతకల్లు నియోజకవర్గం మీదుగా వెళ్తున్నా ఇక్కడి రైతులు, ప్రజలకు సాగు, తాగునీరు అందకపోవడం బాధాకరన్నారు. కావున కరువు ప్రాంతాలైన గుంతకల్లు, గుత్తి, పామిడి, ఉరవకొండ మండలాల్లోని గ్రామాలకు పిల్ల కాలువలు ఏర్పాటు చేసి రాగులుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా కసాపురం గ్రామం సమీపంలోని హంద్రీనీవా కాలువ నుంచి పాతకొత్త చెరువు గ్రామం వరకూ తవ్విన పిల్ల కాలువలను వెడల్పు చేసి లైనింగ్ పనులు చేయాలన్నారు. జిబిసిలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లకంపలు, పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యులు రామునాయక్, అబ్దుల్లా, షాషా, రామునాయక్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్'కు అధిక ప్రాధాన్యత

మంత్రి సత్యకుమార్ యాదవ్ - 27న క్యాన్సర్‌కు ఆయుర్వేద వైద్య చికిత్సపై సదస్సు

ఆయుర్వేద వైద్య చికిత్సపై సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం

ఆయుష్ వైద్య విధానానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నామని వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఈనెల 27వతేదీన నిర్వహించనున్న క్యాన్సర్‌కు ఆయుర్వేద చికిత్సపై నిర్వహించనున్న మెగా సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయుష్ వైద్యుల నియామకాలను ఏపీపీఎస్సీ ద్వారా కాకుండా అల్లోపతి వైద్యుల నియామకం క్రమంలోనే కొనసాగించేలా పరిశీలిస్తున్నామన్నారు. తద్వారా ఖాళీగా ఉన్న నియామకాలను సత్వరమే భర్తీ చేయొచ్చని వివరించారు. సదరన్ స్టేట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ వీరబోయిన నాగేశ్వరరావు, అధ్యక్షులు డాక్టర్ బండారు నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోగుల కుమారయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన అనంతపురంలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న శ్రేయాస్ గ్రాండ్‌లో మెగా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శాంతి ప్రియ, రాష్ట్ర నాయకులు డాక్టర్ మాలిక్, అనంతపురం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ నాయక్, కర్ణాటక రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ పి నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై వేధింపులు ఆపాలని వినతి

జెఎన్‌టియు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో సంబంధం లేకుండా సెమిస్టర్ పరీక్షలకు అనుమతించడంతోపాటు ఫీజుల కోసం ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల వేధింపులను అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జెఎన్‌టియు రిజిస్ట్రార్ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జెఎన్‌టియు పరిధిలో కొన్ని ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం వేధింపులకు పాల్పడుతున్నాయని తెలిపారు. ప్రధానంగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారడం వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఒకవేళ ఫీజు చెల్లించలేని వారిపై ఫైన్ వేస్తామని చెబుతూ హాల్ టికెట్లు ఇవ్వమని విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని తెలిపారు. దీంతో ఇంజినీరింగ్ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో సంబంధం లేకుండా సెమిస్టర్ పరీక్షలకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు అనుగుణంగా కళాశాలలకు సర్క్యులర్‌ను జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, ఎస్‌ఎఫ్‌ఐ నగర ఉపాధ్యక్షుడు సోము, విజయ్, అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ.. ముందు నీఇంట్లో న్యాయం చేయ్..

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్-త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి అధ్యక్షుడు జగన్‌రెడ్డి ముందు తన ఇంట్లో వారికి న్యాయం చేసి తర్వాత ప్రజాక్షేత్రంలోకి రావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. మంగళవారం నగరంలోని 11 డివిజన్‌లో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చాలాచోట్ల ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని ప్రజలు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లలో కనీసం ఒక డ్రెయినేజీ కూడా తీయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరలోనే చేపడతామన్నారు. రూ.88 కోట్లతో నడిమి వంక ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామన్నారు. రూ.16 కోట్లతో డంపింగ్ క్లియరెన్స్ పనులు చేపట్టామని వివరించారు. త్వరలోనే అనంతపురం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఒక స్థలంలోకి ఈ డంపింగ్ తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్ఒ విష్ణుమూర్తి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు రూపనగుడి రవికుమార్, టిడిపి నాయకులు గుర్రం నాగభూషణ, రాయల్ మధు, రమేష్, సరిపూటి రమణ, పావురాల శేఖర్, ఫిరోజ్ అహ్మద్, సాకే లక్ష్మీ నరసింహ, దలవాయి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ నుంచే నాయకుల పుట్టుక

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపి అంబికా, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సామాజిక దృక్పథంలో మెలిగి ప్రజలకు చేతనైన సహాయం సేవలు అందించి సహృదయం కలిగిన వారే నాయకులుగా పుట్టుకొస్తారని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ పరిధి కురుగుంట గ్రామంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేశ భవిష్యత్తు నిర్మాణం యువత చేతిలోనే ఉందని యువత తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. స్వామి వివేకనంద అడుగుజాడల్లో యువత నడవాలని విద్యార్థి దశ నుంచే సేవా మార్గంలో ఉంటూ పరులకు సహాయం పడాలన్నారు. అంబికా ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో కురుగుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు మా సంస్థ అంబిక ఫౌండేషన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం క్యాంపులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ మురళీధర్, ఎస్‌కెయు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మురళీధర్‌రావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పద్మశ్రీ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, ఎస్సార్ ఎడ్యుకేషనల్ వ్యవస్థాపకులు సుంకర రమేష్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, ఐకెసి కోఆర్డినేటర్ జితేంద్ర, లెక్చరర్స్ శ్రీదేవి, శశాంక్‌మౌళి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సామాన్యులపై మోపిన రూ.50 గ్యాస్ ధరను తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో సతమతమవుతున్న సామాన్యులపై గ్యాస్ భారం మోపి నడ్డి విరచడం సరైంది కాదన్నారు. కేవలం కార్పొరేట్లకు ఊడిగం చేసేందుకే గ్యాస్ ధరలు పెంచారని మండిపడ్డారు. గ్యాస్ ధరలతోపాటు పెట్రోల్, డీజిల్‌పై కూడా రూ.2 పెంచుతూ అదానీ, అంబానీ లాంటి బడా కార్పొరేట్ల మెప్పు పొందేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారన్నారు. సామాన్యులు ఉపాధి లేక ఆర్థికంగా చితికిపోతూ కుటుంబాలు చితికిపోతున్నాయన్నారు. అలాంటి ప్రజానీకంపై గుదిబండలా మరోసారి గ్యాస్, పెట్రో ధరలు పెంచి మరింత భారం మోపడం సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి సామాన్యుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

బొమ్మనహాల్ : పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఓబులేసు, శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయిల్ ధర పెరగకపోయినా పెట్రో ధరలు పెంచడం బాధాకరమన్నారు. కేవలం కార్పొరేట్ల కోసమే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచుతోందన్నారు. వెంటనే పెంచిన పెట్రో ధరలను తగించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే ఉద్యమిస్తాం

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-గుత్తి

ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే ఉద్యమ బాట పడతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా కార్యాలయం ప్రధాన గేటు ఎదురుగా సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు లేకుంటే పట్టణాల్లో పరిశుభ్రత, తాగునీరు సరఫరా ఉండదన్నారు. జీవో 36 ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. పట్టణాల విస్తీర్ణం తగ్గ కార్మికులను పెంచాలన్నారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలంటే మున్సిపల్ కార్మికుల అందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులందరూ సమ్మెకు దిగుతారనిహెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వి.నిర్మల, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, పారిశుధ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఇంజనీరింగ్ సెక్షన్ పట్టణ అధ్యక్షులు ఎస్.రాజా, ఉపాధ్యక్షుడు మురళి, నాయకులు శ్రీనివాసులు, నరసింహ, రత్నాలు,చంద్ర, వెంకటమ్మ, లక్ష్మీదేవి, పుల్లన్న,ఈశ్వరయ్య, హరి,తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు సన్మానం

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో ఇటీవల పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించి స్పాట్ వాల్యూయేషన్, అనేక ఉపాధ్యాయ సమస్యలను సమర్థవంతంగా సకాలంలో చొరవ చూపి పరిష్కరిస్తున్న డిఇఒ ఎం.ప్రసాద్‌బాబును ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నర్సింహులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నీటి నిల్వ కందకాల పనులను ఎపిఒ నరేంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే కనీసం రూ.250 నుంచి రూ.300 వరకూ కూలి పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పుట్లూరు : రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల, మోడల్, కెజిబివి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని విద్యాశాఖ అధికారులు, తదితర సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ఉన్న 117 జిఒ రద్దు తర్వాత వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న విద్యా క్యాలెండర్‌పై చర్చించారు. అలాగే గురుకుల, మోడల్, కెజిబివి పాఠశాలల్లో వచ్చే అకాడమిక్ నుంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు. అయితే అడ్మిషన్లు జరిగేలోపు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, నీటిట్యాంకులు, పైప్‌లైన్‌లు, విద్యుత్ పరికరాలు, తదితర అంశాలపై చేపట్టాల్సిన పనులను పూర్తి చేయాలని సూచించారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు అందించండి

యల్లనూరు : ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పరికరాలను మండలంలోని రైతులందరికీ అందజేయాలని జనసేన పార్టీ మండల కన్వీనర్ జి.ఆదినారాయణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం కేవలం ఎస్సీ సామజిక వర్గానికి అదనంగా రోటావేటర్‌ను కేటాయించిందన్నారు. కావున అన్ని సామాజిక వర్గాల రైతులందరికీ 50శాతం సబ్సిడీతో రోటావేటర్‌ను అందజేయాలని కోరారు. మండలంలో సుమారు 10వేలకుపైగా ట్రాక్టర్లు కలిగిన రైతులు ఉన్నారన్నారు. వారందరికీ సబ్సిడీపై ట్రాక్టర్ పరికరాలు ఇవ్వాలని కోరారు.

నెలాఖరు వరకు పన్ను రాయితీ

రాయదుర్గం : 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో పన్ను చెల్లింపుదారులు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రటకనలో తెలిపారు. ఆస్తి పన్నును ఏకమొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించి ఐదుశాతం రాయితీని పొందాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి : ఎంపిడిఒ

పామిడి : గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పని చేయాలని ఎంపిడిఒ తేజోష్ణ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి భోగాతి మురళీమోహన్‌రెడ్డి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల నుంచి జరిగిన జరగబోయే పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత పలు సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలపై ఆరాతీశారు. ఉపాధి హామీ పథకం పనులపై ఎంపిడిఒ తేజోష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో తిరుపతి ఇండో-ఎంఐఎం లిమిటెడ్ బృందం సభ్యులు మంగళవారం ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. ముందుగా తిరుపతి ఇండో-ఎంఐఎం లిమిటెడ్ బృందం జె.శ్రీనివాసులు, ప్రాజెక్టు డెవలప్‌మెంట్ సీనియర్ మేనేజర్ డి.కిరణ్‌కుమార్, హెచ్‌ఆర్ మానస, జి.తరుణ్‌కుమార్‌రెడ్డి హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, తదితరులు విసి హెచ్.సుదర్శన రావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూలో 30 మంది విద్యార్థులు పాల్గొనగా 18 మంది ముఖాముఖీ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, డైరెక్టర్ ఇండస్ట్రియల్ రిలేషన్ ప్లేస్‌మెంట్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కుట్టుమిషన్ల శిక్షణ కేంద్రం ప్రారంభం

శింగనమల : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపిడిఒ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు, సర్పంచులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

రాతిదూలం లాగుడు పోటీలు

ఉరవకొండ : శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని భూదగవి గ్రామంలో మంగళవారం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఏడుజతలు ఎడ్లు పాల్గొన్నాయి. విజేతల ఎద్దుల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.గాదిలింగ, కె.అఖిల్, ఎ.లాలూస్వామి, బి.చక్రి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని రామకోటిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారి జ్యోతులను తలపై ఎత్తుకుని గ్రామమంతా పాటలు, భజనలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

బ్రహ్మసముద్రంలో ఆశా కార్యకర్తలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్

గ్రామాల్లో వైద్యసేవలను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న ప్రజల ఆరోగ్య స్థితిగతుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. అనంతరం ఆశా కార్యకర్తలకు యూనిఫారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ రాణిఎస్తేర్, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : వేసవి ముదురుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావున ఆశా కార్యకర్తలు తప్పకుండా ఒఆర్ఎస్ ప్యాకెట్లను దగ్గర ఉంచుకోవాలన్నారు. గ్రామంలో జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్తపూతలు తీయాలని సూచించారు. అనంతరం ఆశా కార్యకర్తలకు యూనిఫారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేశ్వర్, సిహెచ్‌ఒ జుబేదా, పిహెచ్‌ఎన్ వెంకట లక్ష్మమ్మ, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎల్‌డి కంప్యూటర్ సరితాదేవి, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

అసోసియేట్ ప్రొఫెసర్ నెట్టెకల్ల అంజులతా రచించిన ‘ ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్’ అనే పుస్తకాన్ని మంగళవారం స్థానిక పివికెకెలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత అంజులత మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగంగా మారుతున్న ధోరణులను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా అందించాలనే సంకల్పంతో పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. చదువు ప్రారంభ స్థాయిలో ఉన్నవారి నుంచి ప్రావీణ్యంతో పొందాలనుకునే వారందరికీ ఉపయోగపడే విధంగా రచించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కళాశాల ఛైర్మన్ కిషోర్ పల్లె, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఎఒ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసిడిఎస్ సిడిపిఒ ఉమా శంకరమ్మ

ప్రజాశక్తి-శింగనమల

అంగనవాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ ఉమా శంకరమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శింగనమల ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల 22వతేదీ వరకూ పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరంచారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారంతోపాటు పాలు, గుడ్లు, మునగాకు, ఆకుకూరలు, రాగి పిండి, చిక్కిళ్లు, ఖర్జూరాలు, అటుకులు బెల్లం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఉమాదేవి, కౌసల్య, ధనలక్ష్మి, వాణిశ్రీ, జ్యోతి, నాగమణి, అన్నపూర్ణాదేవి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా అంగన్వాడీల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజామణి, శాంతమ్మ, లావణ్య, సునాలని, మధుమాలిని, బిపిసి లావణ్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన పోషణ్ పక్వాడ్ పోస్టర్లను సిడిపిఒ లక్ష్మీప్రసన్న నేతృత్వంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ వసంతబాబు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తల్లితోపాటు కుటుంబ సభ్యులు అందరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భస్థ దశ నుంచి బిడ్డ పుట్టే రెండేళ్ల వరకూ సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత జీవన శైలిలో పౌష్టికాహార ప్రాధాన్యతపై ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిడిపిఒ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, మెడికల్ ఆఫీసర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పామిడిలో అవగాహన కల్పిస్తున్న ఎసిడిపిఒ నాగమణి

శింగనమలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసిడిఎస్ సిడిపిఒ ఉమా శంకరమ్మ

రాప్తాడు : అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలకు మంగళవారం పోషణ్ పక్వాడ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ధనలక్ష్మి, సూపర్‌వైజర్లు ఝాన్సీ, లీలావతి, హేమ, జయశ్రీ, భారతి, నాగరత్న, డిస్టిక్ కోఆర్డినేటర్ రఘు, బ్లాక్ కోఆర్డినేటర్ ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి : గర్భిణులు, బాలింతలు తీసుకున్న ఆహారంలో పోషక పదార్థాలు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎసిడిపిఒ నాగమణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్-4లో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త భారతి, ఆయా భూలక్ష్మి, పిల్లల తల్లులు, పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పిజిఆర్ఎస్ అర్జీ తనిఖీ

ప్రజాశక్తి-ఆత్మకూరు

క్షేత్రస్థాయిలో రెవెన్యూ సదస్సులో ఇచ్చిన (పీజీఆర్ఎస్) అర్జీని కలెక్టర్ వినోద్‌కుమార్.వి మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ల్ వచ్చిన అర్జీదారుల పిటిషన్ పై సమగ్రంగా పరిశీలన చేశారు.ఆత్మకూరు మండల కేంద్రం పరిధిలోని హరిజన లక్ష్మమ్మ తండ్రి పెద్దన్న అనే అర్జీదారురాలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వేదికలో సర్వేనెంబర్ 547/7 లో ఉన్న ప్రభుత్వ భూమిలో 4.24 ఎకరాలను డిపట్టా కింద తమకు ఇచ్చారని, భూమిని ఆక్రమించి తలారి రామాంజనేయులు, ఓబన్న, కేశవ, హరీష్, జయకుమార్ తదితరులు సాగు చేసుకుంటున్నారని అర్జీని అందించారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ క్షేత్రస్థాయిలో సంబంధిత పొలంలో పర్యటన చేసి సమగ్రంగా వివరాలు ఆరా తీశారు. ఆర్ఐతో పిటిషన్ ని చదివించగా, రికార్డులను తనిఖీ చేశారా అని తహసిల్దార్ ని అడిగారు. ఒరిజినల్ సూట్ స్టేటస్ ని తనిఖీ చేయాలని, ఆర్డిఓకి నివేదిక అందించాలని తహసీల్దార్ ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 547/7 సర్వే నంబర్ లోని భూమిని సబ్ డివిజన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తమ భర్త చనిపోవడంతో సదరు భూమిలో అర్జీదారులు 2016 నుంచి సాగు చేయడం లేదని, రెండు నెలలకు ముందు తమతో గొడవకు దిగి కులం పేరుతో దూషించారని, తమకు రక్షణ కల్పించాలని అర్జీదారులు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి వీఆర్‌ఏ తలారి రామాంజనేయులుకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరు సమస్యపై రికార్డుల మేరకే న్యాయం చేయడం జరుగుతుందని, కోర్టు ఉత్తర్వుల మేరకు దౌర్జన్యాలకు పాల్పడరాదని, అలా దౌర్జన్యాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠినంగా శిక్షించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు సష్టించరాదని తలారి రామాంజనేయులు అన్నదమ్ములకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మానాయక్, మండల సర్వేయర్ మధుర, వీఆర్వో మల్లికార్జున, ఆర్ఐ నాగభూషణం, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రేషన్ అందాలంటే ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

చౌకధాన్యపు డిపోల ద్వారా రేషన్ అందాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలని తహశీల్దార్ ఉపారాణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇకెవైసి చేయించుకోకపోతే వచ్చేనెల నుంచి రేషన్ ఇవ్వరన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఆధార్ కేంద్రాల్లో తప్పక బయోమెట్రిక్ వేయించేలా చూడాలని చెప్పారు. ఇకపోతే చిట్టూరు, చిత్రచేడు గ్రామాల్లో రీసర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఇది వరకూ ఇళ్లు ఉండి ప్రభుత్వం నుంచి కాకుండా సొంతంగా నిర్మించుకున్న వారికి పట్టాలు లేకపోతే తామే గుర్తించి కొలతలు వేసి పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గుత్తి అనంతపురంలో దేవాలయ భూమిలో ప్రస్తుతం హైపవర్ విద్యుత్తు లైను వెళ్తంది, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలని ఎంపిటిసి చిన్నగోవిందు కోరగా దేవదాయశాఖ నుంచి అనుమతులతోపాటు ఆలయం ట్రస్టు ఏర్పాటు కావాలని అప్పుడే ఆలయ పొలాల్లో వెళ్లిన విద్యుత్తు లైనుకు పరిహారం ఇస్తారని చెప్పారు. కాశేపల్లి, గుత్తి అనంతపురం, లక్షుంపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ తీగలను సరి చేయాలని కోరారు.

అనంతరం వ్యవసాయం, వెలుగు, గృహనిర్మాణం, విద్య, వైద్యం, ఐసీడీఎస్, ఉపాధి హామీ, తదితర శాఖల అధికారులు ప్రగతి నివేదకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బారెన్సాహెబ్, ఇఒఆర్‌డి నరసింహారెడ్డి, ఎఒ మల్లీశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సహాయ పశు వైద్యాధికారిణి భార్గవి, ఎంఇఒ రాముడు, వైద్యుడు అమర్నాథ్, పంచాయతీ ఇంజినీర్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

శివాలయం పునర్‌నిర్మాణానికి సహకారం

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని మొదటి రోడ్డులో వెలసిన కాశీవిశ్వేశ్వర, కోదండ రామాలయం పునర్నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ శోభ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పునర్ నిర్మాణం కోసం ఆదాయ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రూ.4.50 కోట్లతో అంచనాలు సిద్ధం చేసినట్లు ఇఒ వివరించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని దేవాదాయశాఖ మంత్రి దృష్టికి కెళ్లి నిధులు వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ భక్తమండలి సభ్యులు దాడి శ్రీనివాసులు చౌదరి, నరేంద్రచౌదరి, జిజె వేణు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను సన్మానిస్తున్న 1వరోడ్డు ఆలయ ఇన్‌ఛార్జి ఇఒ శోభ